# హేరోదు

**దేవుని పరిశుద్ధ నామమునకు మహిమ కలుగును గాక !**

మూలవాక్యము : మార్కు 8 :15

ఆయన చూచుకొనుడి; పరిసయ్యుల పులిసిన పిండిని గూర్చియు **హేరోదు పులిసిన పిండినిగూర్చియు జాగ్రత్త పడుడని వారిని హెచ్చరింపగా**

ప్రియ సహోదరి, సహోదరుడా యేసుక్రీస్తు ఆయన శిష్యులకు చాలా జాగ్రత్తలు చెప్పారు. వాటిలో ఒకటి హేరోదు పులిసిన పిండిని గూర్చి జాగ్రత్త పడుడి  అని యేసు చెప్పిన మాట. ఎవరు ఈ హేరోదు? ఎందుకు దేవుడు హేరోదుని పులిసిన పిండిగా పోల్చినాడు. హేరోదు  అనే వ్యక్తిని యేసు క్రీస్తు జీవితములో  చాలా సందర్భాలలో మనము గమనించవచ్చు. ప్రాముఖ్యముగా కొందరు హేరోదులును మనము పరిశుద్ధగ్రంధములో గమనించవచ్చు.


1. హేరోదు (Herod the great) – మత్తయి 2:16-17 (37 BC-4 BC )
2. హేరోదు అర్కెలాయు - మత్తయి 2:22 (23BC – 18AD)
3. హేరోదు యాన్టిపాస్ - మత్తయి 14:1-11,మార్కు6:17-20 20BC-39AD
4. హేరోదు ఫిలిప్ - మత్తయి14:1-12
5. అగ్రిప్ప-I - అపో" కా 12 వ అధ్యాయము 12BC-44AD
6. అగ్రిప్ప-II - అపో" కా 25:13-26 27AD-100AD

**మొదటి హేరోదు (ఇతను యేసుక్రీస్తు పుట్టుక సమయములో వున్న హేరోదు)**

**ఇతడు క్రీస్తు పూర్వం 75/74 వ సంవత్సరములో జన్మించి క్రీస్తుశకం 1వ సంవత్సరములో మరణించినాడు అని బైబిలు పండితుల అంచనా**

**పాలన కాలము: క్రీస్తు పూర్వము 37 వ సంవత్సరము- నుండి క్రీస్తుపూర్వం 4వ సంవత్సరము వరకు పరిపాలించినాడు.**

హేరోద్ ది గ్రేట్



**కలవరపడిన హేరోదు :**

మత్తయి 2:3 – హేరోదు

రాజు ఈ సంగతి విన్నప్పుడు అతడును అతనితో కూడ యెరూషలేము వారందరును కలవరపడిరి. యేసుక్రీస్తు వారు పుడుతున్నారు అన్న మాట మహా సంతోషకరమైన సువర్తమానము అని వాక్యము చెప్తుంటే హేరోదు మాత్రము కలవరపడుతున్నాడు.

ఇక్కడ రెండు విషయాలు మనము బాగా అర్థం చేసుకోవాలి. హేరోదులో రెండు స్వార్థపూరిత తత్వాలు ఇమిడి వున్నాయి .

**1. తాను రాజుగా వున్నప్పుడు వేరొకరు రాజుగా పుట్టడాన్ని జీర్ణించుకోలేక పోయాడు.**

**2.ఒక వేళ యేసు క్రీస్తు పెద్దవారు అయ్యేటప్పటికి రాజు ముసలి వాడు అవుతాడు అనుకుందాం. అప్పుడు తన తర్వాత తన కుమారుడు రాజు కావాలనుకుంటున్నాడు గనుక వేరొక వంశములో రాజు పుట్టాడు అన్న మాట జీర్ణము చేసుకోలేకపోయాడు.**

**హేరోదుకు కలిగిన ఈ బలహీనత చాలా మంది సేవకులు కలిగివున్నారు. వారు వున్న సంఘాలలో పాస్టర్ తప్ప ఇంక ఎవరు వాక్యము బోధించకూడదు అని ఆంక్షలు పెడుతువుంటారు. వారి తర్వాత వారి కుమారుడికో కుమార్తెకో సంఘ బాధ్యతలు అప్పగిస్తారు. ఇది మంచి పద్ధతి కాదు. అందరు వాక్యము చెప్పాలి. అందరు సేవ చేయాలి. అందరికి సేవ నేర్పించాలి...........**

**యేసుక్రీస్తు పుట్టుక గురించి హేరోదు ప్రధానయాజకులను, శాస్త్రులను విచారించుట :**

మత్తయి 2:4-5 - కాబట్టి రాజు ప్రధాన యాజకులను ప్రజలలోనుండు శాస్త్రులను అందరిని సమకూర్చి క్రీస్తు ఎక్కడ పుట్టునని వారినడిగెను. అందుకు వారు యూదయ బేత్లెహేములోనే; ఏలయనగా యూదయదేశపు బేత్లెహేమా నీవు యూదా ప్రధానులలో ఎంతమాత్రమును అల్పమైనదానవు కావు;

ఇక్కడ ఇద్దరు వ్యక్తులను గూర్చి మనము పరిశీలించాలి. ఒకరు హేరోదు మరియొకరు శాస్త్రులు. హేరోదు యేసుక్రీస్తు గురించి విచారించాడు . కాని ఆయనను చూచుటకు వెళ్ళలేదు. రెండవ వర్గము వారు శాస్త్రులు వీరు లేఖనాలను బాగా పరిశీలించగలరు కాని వాటిని పట్టించుకోరు. ఈరోజుల్లో ఎక్కువమంది క్రైస్తవులు ఈ కోవకు చెందిన వారిగా వుంటున్నారు. Bibleని చదువుతారు గాని వాక్యము యందు విశ్వాసముంచరు. నిజముగా శాస్త్రులు నమ్మి వుంటే పరిగెత్తుకొనిపోయి యేసుక్రీస్తుని చూచి ఆరాధించేవారు.




**హేరోదు కపటోపాయము (జ్ఞానులలను సైతము మోసము చేయడానికి ప్రయత్నించిన వ్యక్తి)**

మత్తయి 2:6,7,8 - అంతట హేరోదు ఆ జ్ఞానులను రహస్యముగా పిలిపించి, ఆ నక్షత్రము కనబడిన కాలము వారిచేత పరిష్కారముగా తెలిసికొని మీరు వెళ్లి, ఆ శిశువు విషయమై జాగ్రత్తగా విచారించి తెలిసికొనగానే, నేనును వచ్చి, ఆయనను పూజించునట్లు నాకు వర్తమానము తెండని చెప్పి వారిని బేత్లెహేమునకు పంపెను.

పై వచనములో గమనిస్తే హేరోదు ఎంత బాగా నటించగలడో అర్థం అవుతుంది. జ్ఞానులు సైతం హేరోదు మనసులోని దురాలోచనని కనిపెట్టలేకపోయారు. జ్ఞానులుకు జాగ్రత్తగా విచారించమని చెప్తున్నాడు అంటే హేరోదు ఎంత మోసగాడో చూడండి. పైగా, నేనూ యేసుక్రీస్తుని పూజిస్తాను అని చెప్తున్నాడు.

తరువాత జ్ఞానులు హేరోదునొద్దకు వెళ్లవద్దని స్వప్నమందు దేవునిచేత బోధింపబడినవారై వారు మరియొక మార్గమున తమ దేశమునకు తిరిగి వెళ్లిరి(మత్తయి 2:12)

**హేరోదు కోపము :** మత్తయి 2:16 - ఆ జ్ఞానులు తన్ను అపహసించిరని హేరోదు గ్రహించి బహు **ఆగ్రహము తెచ్చుకొని,** తాను జ్ఞానుల వలన వివరముగా తెలిసికొనిన కాలమును బట్టి, బేత్లెహేములోను దాని సకల ప్రాంతములలోను, రెండు సంవత్సరములు మొదలుకొని తక్కువ వయస్సుగల మగపిల్లల నందరిని వధించెను.

**ఇక్కడ హేరోదు యొక్క ఇంకొక బలహీనత బయటపడుతుంది. చాలా క్రూరుడు అని.**

**హేరోదు నరహంతకుడు :** మత్తయి 2:16 - ఆ జ్ఞానులు తన్ను అపహసించిరని హేరోదు గ్రహించి బహు ఆగ్రహము తెచ్చుకొని, తాను జ్ఞానులవలన వివరముగా తెలిసికొనిన కాలమునుబట్టి, **బేత్లెహేములోను దాని సకల ప్రాంతములలోను,రెండు సంవత్సరములు మొదలుకొని తక్కువ వయస్సుగల మగపిల్లల నందరిని వధించెను. నరహంతకుడు అన్న మాట చాలా తక్కువగా అనిపిస్తుంది. ఈ లోకములో బుద్ధి వున్నవాడు ఎవడు పసిపిల్లలను చంపడానికి ప్రయత్నించడు. అలాంటిది హేరోదు ఆ దుర్మార్గానికి ఒడికట్టాడు. ఇప్పటికాలములో మరల హేరోదువంటి వ్యక్తులను మనము చూస్తున్నాము .**





**సిరియా దేశములో చిన్నబిడ్డలను రసాయనిక ఆయుధాలతో చంపి ఎలా పడవేసారో చూడండి................**





**2) హేరోదు అర్కెలాయు (యేసుక్రీస్తు వారు తిరిగి నజరేతుకు వచ్చినప్పుడు వున్న హేరోదు )**

మత్తయి 2 : 19 , 20 - హేరోదు చనిపోయిన తరువాత ఇదిగో ప్రభువు దూత ఐగుప్తులో యోసేపునకు స్వప్నమందు ప్రత్యక్షమై నీవు లేచి, శిశువును తల్లిని తోడుకొని, ఇశ్రాయేలు దేశమునకు వెళ్లుము;

**3) చతుర్థాధిపతియైన హేరోదు(హేరోదు antipaus) (బాప్తిస్మమిచ్చు యోహానును చంపించిన హేరోదు)**

**ఇతడు క్రీస్తు పూర్వము 20 వ సంవత్సరములో జన్మించి-**

**క్రీస్తు శకము 30వ సంవత్సరములో మరణించినాడు అని అంచన.**




**పరిపాలన కాలము: క్రీస్తు పూర్వము 4వ సంవత్సరము నుండి క్రీస్తు శకము 39 వ సంవత్సరము వరకు పరిపాలించినాడు.**

**హేరోదు వ్యభిచారి: మత్తయి 14: 3,4** -ఏలయనగానీవు నీ సోదరుడైన ఫిలిప్పు **భార్యయగు హేరోదియను ఉంచుకొనుట** న్యాయము కాదని యోహాను చెప్పగా,

హేరోదు **ఆమె నిమిత్తము యోహానును పట్టుకొని బంధించి చెరసాలలో వేయించి యుండెను**.

**విలువలు లేని వ్యక్తి :**

మత్తయి 14: 6 అయితే హేరోదు జన్మదినోత్సవము వచ్చినప్పుడు హేరోదియ **కుమార్తె వారిమధ్య నాట్యమాడి హేరోదును సంతోష పరచెను.**

**మనుషుల సంతోషం కోసం అన్న కూతురి చేత అందరిముందు నాట్యము చేయించిన ఘనుడు.**

**వదిన మెప్పుకోసం దేవుని ప్రవక్తను చంపించెను:**

మత్తయి 14: 9-10 రాజు దుఃఖపడినను తాను చేసిన ప్రమాణము నిమిత్తమును, తనతో కూడ భోజనమునకు కూర్చున్నవారి నిమిత్తమును ఇయ్యనాజ్ఞాపించి బంట్రౌతును పంపి చెరసాలలో యోహాను తల గొట్టించెను.

**హేరోదియకు, ప్రవక్తలను చంపే యెజెబెలుకు పెద్ద తేడా లేదు:**

మత్తయి 14: 8 అప్పుడామె తన తల్లిచేత ప్రేరేపింపబడినదై బాప్తిస్మమిచ్చు యోహాను తలను ఇక్కడ పళ్లెములో పెట్టి నా కిప్పించుమని యడిగెను.

**బిడ్డలకి హత్య చేయమని నేర్పించిన తల్లిగా ఒక్క హేరోదు అన్నభార్యను మాత్రమే చూడగలము .**

**మీరు బాగా గమనించినట్లైతే యోహాను, ఏలియాగా చెప్పబడ్డాడు .ఏలియా కాలములో యెజెబెలు ప్రవక్తలను ఎలాగు చంపించిందో ఆలాగున క్రొత్తనిభందన కాలములో మొదటి యెజబేలుగా హేరోదియాను చూడవచ్చు.**

**రాక్షస తత్వము కలిగిన హేరోదియా కుమార్తె :** **చిన్నాన్న జన్మదినాన అందరిముందు నాట్యముచేసి అందరిని మెప్పించి, బహుమానము ఏమి కావాలని అడిగితే బాప్తిస్మమిచ్చు యోహాను తల అడిగింది అంటే ఇదంతా తల్లి కుమార్తెల కపట నాటకము .నేటికి ఇలా కుమార్తెల చేత ఇలాంటివి చేయించే తల్లులు క్రైస్తవ్యములో ఉన్నారు.**

మత్తయి 14: 11 – వాడతని తల పళ్లెములోపెట్టి తెచ్చి ఆ చిన్నదానికిచ్చెను; ఆమె తన తల్లియొద్దకు దాని తీసికొని వచ్చెను.

తల్లి ఎంత తర్ఫీదు కుమార్తెకు ఇచ్చిందో చూడండి. నరకబడిన తలను తన చేతులతో పట్టుకొని రాగలిగింది అంటే ఎంత రాక్షసంగా పెంచిందో మనకు అర్ధము అవుతుంది.

**3వ హేరోదురాజు భయము :**

మార్కు 6:14 - ఆయన కీర్తి ప్రసిద్ధమాయెను గనుక రాజైన హేరోదు ఆయనను గూర్చి విని బాప్తిస్మమిచ్చు యోహాను మృతులలోనుండి లేచియున్నాడు గనుక అతనియందు అద్భుత ములు క్రియారూపకములగుచున్నవని చెప్పెను.

ఇతరులు ఈయన ఏలీయా అనియు, మరికొందరు ఈయన ప్రవక్తయనియు, ప్రవక్తలలో ఒకనివలె నున్నాడనియు చెప్పుకొనుచుండిరి. అయితే హేరోదు విని నేను తల గొట్టించిన యోహానే; అతడు మృతులలోనుండి లేచి యున్నాడని చెప్పెను.

**పశ్చాత్తాపపడని హేరోదు :**

లూకా 9: 7-9 - చతుర్థాధిపతియైన హేరోదు జరిగిన కార్యము లన్నిటిని గూర్చి విని, యెటుతోచక యుండెను. ఏలయనగా కొందరుయోహాను మృతులలోనుండి లేచెననియు, కొందరు ఏలీయా కనబడెననియు; కొందరు పూర్వకాలపు ప్రవక్తయొకడు లేచెననియు చెప్పుకొనుచుండిరి. అప్పుడు హేరోదు నేను యోహానును తల గొట్టించితిని గదా; యెవనిగూర్చి యిట్టి సంగతులు వినుచున్నానో అతడెవడో అని చెప్పి ఆయనను చూడగోరెను.

**యేసుక్రీస్తు గురించి విని, తాను చంపించిన యోహాను తిరిగిలేచాడు అని భ్రమపడుతున్నాడు, భయపడుతున్నాడు కాని తాను చేసినది నేరము అని అంగీకరించడం లేదు.**

**మరల మరల పాపము చేయువాడు :**

బహుశా యేసుక్రీస్తే, యోహాను అని బలముగా నమ్మి ఉంటాడు అందుకే యేసుక్రీస్తుని కూడా చంపాలనుకుంటున్నాడు. మరల పాపము చేయడానికి సిద్ధమయ్యాడు

**హేరోదు ఒక నక్క :** లూకా 13 : 31-33 - ఆ గడియలోనే కొందరు పరిసయ్యులు వచ్చినీ విక్కడనుండి బయలుదేరి పొమ్ము; **హేరోదు నిన్ను చంప గోరుచున్నాడని ఆయనతో చెప్పగా** ఆయన వారిని చూచిమీరు వెళ్లి, ఆ నక్కతో ఈలాగు చెప్పుడి ఇదిగో నేడును,రేపును నేను దయ్యములను వెళ్ల గొట్టుచు (రోగులను) స్వస్థపరచుచు నుండి మూడవ దినమున పూర్ణ సిద్ధి పొందెదను. అయినను నేడు రేపు ఎల్లుండి నా త్రోవను నేను పోవుచుండవలెను; ప్రవక్త యెరూషలేమునకు వెలుపల నశింపవల్లపడదు.

లూకా 13 : 31-33 - ఆ గడియలోనే కొందరు పరిసయ్యులు వచ్చినీ విక్కడనుండి బయలుదేరి పొమ్ము; హేరోదు నిన్ను చంప గోరుచున్నాడని ఆయనతో చెప్పగా **ఆయన వారిని చూచి మీరు వెళ్లి, ఆ నక్కతో ఈలాగు చెప్పుడి** ఇదిగో నేడును రేపును నేను దయ్యములను వెళ్ల గొట్టుచు (రోగులను) స్వస్థపరచుచునుండి మూడవ దినమున పూర్ణ సిద్ధి పొందెదను. అయినను నేడు రేపు ఎల్లుండి నా త్రోవను నేను పోవుచుండవలెను; ప్రవక్త యెరూషలేము నకు వెలుపల నశింపవల్లపడదు.

**యెరుషలేములో ప్రవేశించిన నక్క :**

లూకా 23 :7-12 - ఆయన హేరోదు అధికారము క్రింద ఉన్న ప్రదేశపు వాడని తెలిసికొని హేరోదునొద్దకు ఆయనను పంపెను. **హేరోదు ఆ దినములలో యెరూషలేములో ఉండెను..**

ఎప్పుడైతే యేసుక్రీస్తు వారు యెరూషలేము బయట  నశింపవల్లపడదు అని చెప్పినారో హేరోదు కుడా యెరూషలేముకు వచ్చాడు. హేరోదు యేసుక్రీస్తుని చంపడంకోసం ఏమి చేయడానికైనా సిద్ధపడిపోయాడు.

**యేసుక్రీస్తుని అపహసించిన, తృణీకరించిన హేరోదు :**

లూకా 23 :11-12 - హేరోదు తన సైనికులతో కలిసి, ఆయనను **తృణీకరించి అపహసించి**, ఆయనకు ప్రశస్తమైన వస్త్రము తొడిగించి పిలాతునొద్దకు మరల పంపెను.  అంతకు ముందు హేరోదును పిలాతును ఒకనికొకడు శత్రువులై యుండి ఆ దినముననే యొకనికొకడు మిత్రులైరి.

**4) హేరోదు ఫిలిప్ (హేరోదియ అసలు భర్త)**


మత్తయి14:3 : **ఏలయనగా నీవు ,నీ సోదరుడైన ఫిలిప్పు భార్య యగు హేరోదియను ఉంచుకొనుట న్యాయాము కాదని యోహాను చెప్పగా**

**5) అగ్రిప్ప –I (మొదటి హేరోదు యొక్క మనవడు లేక 2వ హేరోదుయొక్క కుమారుడు)**

**ఇతడు క్రీస్తు పూర్వము 11 వ సంవత్సరములో జన్మించి-**

**క్రీస్తు శకము 44 వ సంవత్సరములో మరణించినాడు.**

హేరోద్ అగ్రిప్ప



**పరిపాలన కాలము: క్రీస్తు శకము 41 నుండి 44 వరకు పరిపాలించినాడు.**

**ఇతని పూర్తి పేరు మార్కస్ జూలియస్ అగ్రిప్ప .**

**1. యాకోబుని చంపించిన హేరోదు :**అపొస్తలుల కార్యములు 12 :1-3

దాదాపు అదే కాలమందు రాజైన హేరోదు సంఘపు వారిలో కొందరిని బాధపెట్టుటకు బలాత్కారముగా పట్టుకొని యోహాను సహోదరుడైన యాకోబును ఖడ్గముతో చంపించెను.ఇది యూదులకు ఇష్టమైన కార్యమని తెలిసికొని పేతురును కూడ పట్టుకొనెను.

**2. దేవునిని మహిమ పరచని హేరోదు :**అపొస్తలుల కార్యములు 12 :21-23

నియమింపబడిన దినమందు హేరోదు రాజవస్త్రములు ధరించుకొని న్యాయపీఠము మీద కూర్చుండి వారి యెదుట ఉపన్యాసము చేయగా జనులు ఇది దైవస్వరమే కాని మానవ స్వరముకాదని కేకలు వేసిరి.

**3.పురుగులు పడి చచ్చిన హేరోదు :** అపొస్తలుల కార్యములు 12 :21-23 నియమింపబడిన దినమందు హేరోదు రాజవస్త్రములు ధరించుకొని న్యాయపీఠము మీద కూర్చుండి వారి యెదుట ఉపన్యాసముచేయగా జనులు ఇది దైవస్వరమేకాని మానవ స్వరముకాదని కేకలు వేసిరి.

**అతడు దేవుని మహిమ పరచనందున** వెంటనే ప్రభువు దూత అతని మొత్తెను గనుక **పురుగులు పడి ప్రాణము విడిచెను.**

**6) అగ్రిప్ప –II( పౌలు కాలములో వున్న హేరోదు)**

1. **హేరోదు యూదుల ఆచారములు ఎరిగిన వ్యక్తి :**అపొ' కార్యములు : 26:1,2 - అగ్రిప్ప పౌలును చూచి నీ పక్షమున చెప్పు కొనుటకు నీకు సెలవైనదనెను. అప్పుడు పౌలు చేయి చాచి యీలాగు సమాధానము చెప్పసాగెను . అగ్రిప్పరాజా, **తమరు యూదులలో ఉండు సమస్తమైన ఆచారములను వివాదములను విశేషముగా ఎరిగిన వారు గనుక**




**2. క్రైస్తవునిగా మారుటకు ఇష్టపడని హేరోదు :** అపో' కార్యములు : 26 – 28 అందుకు అగ్రిప్పఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయ జూచుచున్నావే అని పౌలుతో చెప్పెను.

అతడు దేవుని మహిమపరచనందున వెంటనే ప్రభువు దూత అతని మొత్తెను గనుక పురుగులు పడి ప్రాణము విడిచెను.

**హేరోదీయులు :** వీరు హేరోదు పరిపాలన కాలములో హేరోదుని అనుసరించిన వారు.

మార్కు 3:6 - పరిసయ్యులు వెలుపలికి పోయి వెంటనే హేరోదీయులతో కలిసికొని, ఆయన నేలాగు సంహరింతుమా యని ఆయనకు విరోధముగా ఆలోచన చేసిరి.

**హేరోదియులు కూడా ఎప్పుడు క్రీస్తుని సంహరింతుమా అని చూచెడివారు.**

**పొగడ్తలు హేరోదీయుల లక్షణము :**

మార్కు 12: 13-15 - వారు మాటలలో ఆయనను చిక్కుపరచవలెనని, పరిసయ్యులను హేరోదీయులను కొందరిని ఆయన యొద్దకు పంపిరి. వారు వచ్చి బోధకుడా, నీవు సత్యవంతుడవు; నీవు ఎవనిని లక్ష్యపెట్టని వాడవని మేమెరుగుదుము; నీవు మోమోటములేనివాడవై దేవుని మార్గము సత్యముగా బోధించువాడవు. కైసరుకు పన్నిచ్చుట న్యాయమా? కాదా? ఇచ్చెదమా ఇయ్యకుందుమా? అని ఆయన నడిగిరి.

**హేరోదీయులు వేషధారులు మరియు శోధకులు :**

ఆయన వారి వేషధారణను ఎరిగిమీరు నన్ను ఎందుకు శోధించుచున్నారు? ఒక దేనారము1 నా యొద్దకు తెచ్చి చూపుడని వారితో చెప్పెను.

**ఇంత భయంకరమైన వంశమును ఎప్పుడు చూడవేమో ?**

**హేరోదుల వంశము క్రీస్తుకు, క్రైస్తవులకు విరోధమే. చంపించుటయే వారి వృత్తి, ప్రవృతి. ఒకప్పుడు క్రైస్తవ్యాన్ని అసహ్యించుకొని, సంఘాన్ని హింసించిన మనము దేవుని కృప వలన ఈ రోజు మనము క్రైస్తవులుగా రూపాంతరము చెందాము. ఈ రూపాంతరము చెందడానికి మనము వినిన లెంటు ధ్యానాలు, లేక సిలువ ధ్యానాలు, మనము చూచిన క్రీస్తు గాయాలు, మనము నేర్చుకొనిన పరిశుద్ధ సత్యాలు.**

**మందిరములో ఒక సంవత్సరములో 54 ఆదివారాలంటే 54 ప్రసంగాలు వింటాము. కాని లెంటులో ప్రొద్దున సాయంత్రము 2 ప్రసంగాలు చొప్పున 45 రోజుల్లో(ఆది వారాలతో సహా) 90 ప్రసంగాలు వింటాము.**




ఆదివారము విన్న ప్రసంగము  వారము తిరిగేసరికి మాయమైపోతుంది. ఎందుకంటే వారమంత లోకములో ఉంటాము కనుక. కాని మందిరములోనే ఈ లెంటులో వుంటే ఆ ప్రార్ధన వాతావరణము మనలోనుండి  సాతాను ఏమి ఎత్తుకొని పోకుండా కాపాడుతుంది.

జ్ఞానులు ప్రశ్నిస్తారు lentలో మందిరములోనే ఉండాలని ఎక్కడ వుంది  అని. ఒక లెంటు మాత్రమే కాదు కుదిరితే జీవితకాలము వుండడానికి ప్రయత్నించాలి. దావీదు రాజు వ్రాశారు “ చిరకాలము నేను యెహోవ మందిరములో నివాసము చేసెదను” అని (కీర్తన 23- 6)

ప్రియ సహోదరి, సహోదరుడా మీరు కూడా అధిక సమయము మీమందిరాలలో వాక్యము చదువుతూ, వింటూ, ధ్యానిస్తూ, ప్రార్థిస్తూ మీ వ్యర్ధ సమయాన్ని ప్రయోజనకరంగా మార్చుకోండి. ఆత్మీయముగా అభివృద్ధి చెందండి.

ప్రియ సేవకుల్లారా, మీ మందిరాలలో ఇలాంటి క్రమాలు నేర్పించండి. మందిరములో సమయం గడపటానికి నేర్పించండి. దయచేసి విసుక్కోకండి.మీకున్న రక్త సంబంధిదికులు విశ్వాసులే కదా.